క్లుప్తంగా

ప్రజలకు వెన్నుపోటు పొడిస్తే ప్రతిపక్షం ఊరుకోదు

గోపాలపురం: అమలు సాధ్యం కాని హామీలిచ్చి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తుంటే ప్రతిపక్షం చూస్తూ ఊరుకోదని, పోరాటాలకు సిద్ధమవుతామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, నల్లజర్లలో బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమం ద్వారా చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎన్నికల సమయంలో అలవి కాని హామీలిచ్చి చేతులెత్తేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నయవంచనను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. తెనాలిలో ముగ్గురు దళిత యువకులను పోలీసులు రోడ్డుపై చిత్రహింసలకు గురి చేయడం చూస్తుంటే ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర హోం మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని వేణు డిమాండ్ చేశారు.

అభ్యంతరం లేని భూములు క్రమబద్ధీకరించుకోండి

నల్లజర్ల: అభ్యంతరం లేని గ్రామకంఠం, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు సూచించారు. అనంతపల్లి ఇటుకల బట్టీల వద్ద జగనన్న కాలనీ సమీపాన ఖాళీగా ఉన్న పోరంబోకు భూములను కొంతమంది ఆక్రమించి గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారు. వీటని క్రమబద్ధీకరించడానికి వారు అందించిన దరఖాస్తులను జేసీ మంగళవారం పరిశీలించారు. అభ్యంతరం లేని భూముల్లో నివసిస్తున్న వారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, వీఆర్‌ఓలు రామసీత, కిరణ్ ఉన్నారు. అంతకు ముందు తెలికిచెర్లలో వృద్ధురాలి ఇంటికి వెళ్లి రేషన్ బియ్యం అందజేశారు.

క్రికెట్ పోటీలకు ఎంపిక


కృష్ణ స్పందన

గోపాలపురం: అండర్–19 మహిళా క్రికెట్ పోటీలకు మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన ఆలపాటి కృష్ణ స్పందన ఎంపికైనట్లు ఆమె తల్లి దుర్గాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31న బీమవరం డీఎన్ఆర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి మహిళా పోటీల్లో ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకూ మంగళగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గోపాలపురం: ముందుగా అందిన సమాచారం మేరకు కరగపాడులో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని దేవరపల్లి ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సారా తయారు చేస్తున్న బుర్రి వెంకట రమణను అరెస్టు చేశామన్నారు. బుచ్చియ్యపాలెంలో సారా అమ్ముతున్న చిక్కాల రామకృష్ణను అరెస్టు చేసి, అతడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సోమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

ఉండ్రాజవరం: తాడిపర్రులో నూతనంగా పునఃనిర్మించిన పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా ఈనెల 4,5వ తేదీల్లో యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, కలశారాధన, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 6న ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ, సమస్త విగ్రహ యంత్ర ధ్వజ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించినట్టు ఏవో ఎం.రామయ్య, అర్చకులు మంచిలి సాయిరామ్ శర్మ తెలిపారు.

విత్తన షాపుల్లో తనిఖీ

నిడదవోలు : విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలోని విత్తన షాపుల్లో ఆయన తన సిబ్బందితో విత్తనల నాణ్యత, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనములు కొనేటప్పుడు కొద్దిగా శాంపిల్, బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పట్టణంలోని పలు విత్తనాలు విక్రయించే షాపులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కేవీ ఎల్ఎన్‌డీ పేట చెట్లు తొలగించడానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని నిడదవోలు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం, కోమటికుంట, కరిచర్లగూడెం, నందిగూడెం, బుచ్చింపేట, సంజీవపురం గ్రామాలకు, ఇండస్ట్రియల్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశుగ్రాసానికి గడ్డు కాలం

- భారంగా మారిన పశుపోషణ
- ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.8 వేలు పలుకుతున్న వైనం
- ఖర్చులు పెరగడంతో గగ్గోలు పెడుతున్న పాడిరైతులు


ట్రాక్టరుపై రవాణా చేస్తున్న వరి గడ్డి


ఊనగట్లలో పశుగ్రాసాన్ని కోస్తున్న పాడి రైతులు

చాగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ ద్వారా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. చిన్న సన్నకారు రైతులతోపాటు రైతు కూలీలు పాడి పశువులే ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తారు. ఎన్నో ఏళ్లుగా పాడి పశువుల పోషణ రైతు కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా ఉపయోగపడుతోంది. ఇటీవల పాల ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆర్థిక స్తోమత కలిగిన కొందరు రైతులు డ్రెయిరీ ఫామ్‌లను ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పశుపోషణ భారంగా మారడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. పశువుల దాణా రేట్లు పెరగడంతోపాటు ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. దీనికి తోడు ఇటీవల ఈ ప్రాంతంలో వరి నూర్పిడికి యంత్రాలను ఎక్కువగా వినియోగించడంతో ఎండుగడ్డి పశువుల దాణాకు పనికిరాకుండా పోతోంది. దీంతో రానున్న కాలంలో పశువుల పోషణ ఇబ్బందిగా మారనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత, పశువుల దాణా రేట్లు పెరిగిపోయి పశువుల పెంపకం కష్టమవుతోందని రైతులు అంటున్నారు. సాధారణంగా జనవరి నుంచి పచ్చగడ్డి దొరికే అవకాశం లేకపోవడంతో రైతులు ఎండి గడ్డిని ఆశ్రయిస్తున్నారు. మూగ జీవాలకు గ్రాసం కరువై బక్కచిక్కిపోతున్నాయి. మేత దొరక్క పశువులను అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. చాగల్లు మండలంలో గేదెలు 3,000, ఆవులు 1,200, వీటిలో పాడి గేదెలు, ఆవులు 2,200 ఉన్నాయి. లీటరు పాలు వెన్నశాతం ఆధారంగా రూ.60 నుంచి 80 వరకు కొనుగోలు చేస్తున్నారు.

పశుగ్రాసం కొరత

పశువుల పెంపకానికి పశుగ్రాసం ప్రధాన సమస్యగా ఉంది. కూలీల కొరతతో సాగులో రైతులు యంత్రాలను ఆశ్రయించడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీనితో ఎండుగడ్డి కొరత ఏర్పడి ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గడ్డి రూ. 8,000 వరకూ అమ్ముతున్నారు. దాణా 50 కేజీల బస్తా రూ.1,300 ఉంటుంది. ఉలవలు, గంట్లు, తవుడు, జొన్నల ధరలు రెట్టింపు అయ్యాయి. పశువుల కాపరులుగా ఉండటానికి కూలీలు లభించడం లేదు. పచ్చిరొట్ట మేత ధర ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. 1, 2 మించి గేదెలను పెంచలేకపోతున్నామని పాడి రైతులు చెబుతున్నారు.

నామమాత్రంగానే పశుగ్రాస సాగు

గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో బహు వార్షిక పశుగ్రాస సాగు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఈ పథకం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. సొంత పొలం కలిగి, నీటి వసతి ఉండే పాడి రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. గడ్డి సాగు చేసే వరకు రైతుకు కూలి సొమ్ము కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. గడ్డి సాగుకు అయ్యే ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. అయితే దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో మండలంలో 6 ఎకరాల్లో మాత్రమే గడ్డిని పెంచుతున్నారు.

'ఉపాధి'లో గడ్డిని పెంచుకోవాలి



ఎండాకాలం కావడంతో మూగజీవాలు మేత దొరక్క ఆకలితో అలమటిస్తున్నాయి. పాడి రైతులు ఉపాధి హామీ పథకంలో గడ్డిని పెంచుకోవాలి. ప్రభుత్వం 70 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు, 50 శాతం సబ్సిడీతో దాణా అందిస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ముఖేష్, పశువైద్యాధికారి, చాగల్లు

పాడి రైతులను ప్రోత్సహించాలి



ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించాలి. ఎండుగడ్డి ధర అధికంగా ఉండడంతో పశువులను మేపాలంటే అధిక వ్యయం అవుతోంది. పశువులను మేపడానికి కూలీల కొరత నెలకొంది. పరిస్థితి ఇలాగే ఉంటే పల్లెల్లో పాడి పెంపెకం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

– ఈ.మురళి, రైతు, బాహ్మణగూడెం

అక్టోబర్ 15 వరకు ఓపెన్ ఇసుక ర్యాంపుల నిలుపుదల

– ఆర్డీవో రాణి సుస్మిత


తాడిపూడి ర్యాంపు వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసిన అధికారులు

తాళ్లపూడి (కొవ్వూరు): ఓపెన్ ర్యాంపుల్లో అక్టోబరు 15వ తేదీ వరకు ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని, ఈ మేరకు మైన్స్ శాఖ ఆధ్వర్యంలో పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు మంగళవారం కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత తెలిపారు. తాడిపూడి గ్రామంలో మూడు ఇసుక రీచ్‌లు నిర్వహించామని, వాటిలో ఓపెన్ ర్యాంపుల్లో జూన్ 1వ తేదీ నుంచి కార్యకలాపాలు నిలుపుదల చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ క్రమంలో తాళ్లపూడి మండలం తాడిపూడిలో మూడు ఇసుక రీచ్‌లు ఉండగా రెండు సెమీ మెకానైజ్డ్ పాయింట్లు, ఒక డెసిల్టేషన్ పాయింట్లకు అనుమతి ఇచ్చామన్నారు. జూన్ 1వ తేదీ నుంచి రెండు ఓపెన్ ఇసుక ర్యాంపుల్లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని ఆమె పేర్కొన్నారు.

తాడిపూడి ర్యాంపుల్లో ఇసుక లారీ సీజ్

తాడిపూడి ఇసుక ర్యాంపులో నిబంధనలు పాటించకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఒక లారీని సీజ్ చేసి, కేసు నమోదు చెసినట్టు ఆర్డీఓ తెలిపారు. సంబంధిత ఓపెన్ రీచ్ పాయింట్ ఏజెన్సీకి నోటీసు జారీ చేశామని ఆర్డీవో తెలిపారు. తాళ్లపూడి ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, టాస్క్ ఫోర్స్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కొవ్వూరు మండలంలో ఆరికిరేవుల, చిడిపి, కుమారదేవం, కుమారదేవం–1, కుమారదేవం–2, తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం, ప్రక్కిలంక ర్యాంపులు మూసివేస్తామన్నారు. పడవల ద్వారా నడిచే డీసిల్టేషన్ ర్యాంపులు కొనసాగుతాయని తెలిపారు.

రేషన్ సరకుల పంపిణీ పరిశీలన

చాగల్లు: రేషన్ కార్డుదారులకు సక్రమంగా సరకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. మండల కేంద్రమైన చాగల్లుతో పాటు పలు గ్రామాల్లో రేషన్ దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటికే రేషన్ సరుకులు అందించాలని అన్నారు. చాగల్లులో వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ ప్రక్రియను, ఊనగట్లలో మండలస్థాయి స్టాక్ పాయింట్‌ను తహసీల్దార్ పరిశీలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉండ్రాజవరం: ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ జాగ్రత్త వహించాలని ఉమ్మడి గోదావరి జిల్లాల కస్టర్ కోఆర్డినేటర్ తేజ అన్నారు. విజయవాడ డాన్ బాస్కో నవజీవన బాలభవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సైబర్ నేరాల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. సైబర్ మోసాలపై హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలన్నారు. సీహెచ్‌వో సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ కుమారి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన చంద్రబాబు

- 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


కొవ్వూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, చిత్రంలో మేడపాటి షర్మిల రెడ్డి


నల్లజర్లలో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత, కాకుమాను రాజశేఖర్

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు విస్మరించి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిల రెడ్డితో కలసి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో ప్రజలను మోసం చేసిన తీరును బహిరంగంగా వివరించేందుకు వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. 4వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు కొవ్వూరు మెరక వీధి వాటర్ ట్యాంక్ నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, తాళ్లపూడి మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కంఠమని రమేష్, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, సూరిబాబు, పాలమేర్ల నగేష్, కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం

నిడదవోలు: రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిడదవోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి గణేష్‌చౌక్, చాగల్లు రోడ్డులో ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి చేరి వినతిపత్రం అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం

నల్లజర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, వారి నియంతృత్వ విధానాలపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు రానున్నాయని మాజీ హోంమంత్రి తానేటి వనిత అన్నారు. మంగళవారం నల్లజర్లలో మండల శాఖ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రమణ్యం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో తానేటి వనితతోపాటు నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ చంద్రబాబుకు వెన్నులో వణుకు పుట్టించే విధంగా వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దామని అన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటపు హామీలిచ్చి అధికారం చేపట్టాక నిధులు లేవంటూ చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయిలో జూన్ 4న నల్లజర్లలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినాన్ని పార్టీ నాయకులు,కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, నాయకులు బంక అప్పారావు, అప్పసాని శేషగిరి, మేణ్ణి యువ రాజు, పరమేశ్వరావు, గోపాలపురం మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, మహిళాధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అందుగుల వెంకటేశ్వరావు, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీ నాగూయాదవ్, నియోజకవర్గ కార్మిక సంక్షేమశాఖ అధ్యక్షుడు మద్దూరి నాగేశ్వరావు, రిటైర్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెనుమాక వెంకటరత్నం పాల్గొన్నారు.

దూదీ లేదు.. టించరూ లేదు..

- సబ్ సెంటర్ దుస్థితిపై సర్పంచ్ ఆవేదన
- గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు
- మండల పరిషత్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సింహాద్రిరావు

నల్లజర్ల: ఆస్పత్రిలో దూది కూడా అందుబాటులో లేదు.. గాయపడిన వారికి కనీస వైద్యం అందించే టించర్ కూడా లేదు. ఇదీ సబ్ సెంటర్‌లో నెలకొన్న దుస్థితి.. అంటూ ప్రకాశరావుపాలెం సర్పంచ్ జాన్ విక్టర్ ఆవేదన వెళ్లగక్కారు. మంగళవారం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను సర్పంచ్ జాన్ విక్టర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. యోగాంధ్రను విజయవంతం చేయాలని సభ్యులను కోరిన పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావుకు సర్పంచ్ అక్కడి పరిస్థితులను వివరించారు. దీనిపై స్పందించిన డాక్టర్ గంగాధరరావు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులు రూ.6 కోట్లతో వివిధ గ్రామాల్లో 14 కి.మీ. మేర అంతర్గత సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు పంచాయతీరాజ్ ఏఈ పవన్ వెల్లడించారు. రాజమహేంద్రవరం ఎంపీ నిధులు రూ.25 లక్షలతో ప్రకాశరావుపాలెం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవనం టెండర్ ప్రక్రియ పూర్తయితే త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. గంటావారిగూడెంలో రూ.4 లక్షల జెడ్పీ నిధులతో గ్రావెల్ రహదారి, ప్రకాశరావుపాలెంలో రూ.1.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెన్లు నిర్మించనున్నట్టు వివరించారు. మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో చీపురుగూడెం–కృష్ణమ్మగూడెం రహదారిని మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తారన్నారు. పంచాయతీరాజ్ నిధులతో తూర్పుచోడవరం–గుండేపల్లి రోడ్డును రూ.1.80 కోట్లతో బీటీ రహదారిగా ఆధునీకరించనున్నట్టు చెప్పారు. అభ్యంతరం లేని గ్రామకంఠం భూముల్లో నివసిస్తున్న వారు (కనీసం 150 గజాలు) క్రమబద్ధీకరించుకోవచ్చని ఆర్ఐ శర్మ తెలిపారు. తెలికిచెర్లలో భూముల రీసర్వే ప్రారంభించినట్టు తెలిపారు. ఉపాధి హామీ ఏపీఓ త్రిమూర్తులు మాట్లాడుతూ 1.20 లక్షల పని దినాలు పూర్తి చేసినట్టు చెప్పారు. మండలంలో పూర్తి కావాల్సిన 304 గృహ నిర్మాణాలు జూన్ 12 నాటికి పూర్తి చేయాలని సంబంధిత వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నేరు శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీఓ సింహాద్రిరావు కోరారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ బాపిరాజు, ఏపీఎం శ్యామ్‌సుందర్, ఎంఈఓ వై.సత్యనారాయణ, ఉద్యాన శాఖాధికారి బబిత, ఏఈఓ పుష్ప తమ శాఖల పనితీరును సమర్పించారు.

తుని కేసును తిరగదోడే ప్రయత్నం విరమించుకోవాలి

- కాపు సంఘం నాయకుడు దుర్గారావు డిమాండ్



దుర్గారావు

దేవరపల్లి: కాపులను బీసీల్లో చేర్చాలన్న ఉద్యమం సందర్భంగా తునిలో చోటు చేసుకున్న ఘటనపై నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టేసి నప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వం దానిని తిరగదోడే ప్రయత్నం చేయడం అన్యాయమని కాపు సంక్షేమ సంఘం గోపాలపురం నియోజకవర్గం అధ్యక్షుడు కేవీకే దుర్గారావు అన్నారు. మంగళవారం దేవరపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయస్థానం కొట్టేసిన కేసును కూటమి ప్రభుత్వం తిరగదోడడంలో గల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎప్పుడో సమసిపోయిన కేసును తిరగదోడి కాపులను ఇబ్బందులకు గురి చేసే ప్రభుత్వ కుట్రను ఐక్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి కాపుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే తన అసలు నైజాన్ని చూపిస్తున్నారని అన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు కాపులను బీసీల్లో చేర్చుతామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారని అన్నారు. ఎన్నికల హామీని అమలు చేయాలని కాపు రిజర్వేషన్ పోరాట ఉద్యమాన్ని చేపట్టగా 2016లో అక్రమ కేసులు పెట్టి కాపు సంఘం నాయకులను వేధించారని గుర్తుచేశారు. కేసులు తిరగదోడే ప్రయత్నాలను తక్షణం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా కాపులంతా ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కాపు సామాజికవరానికి చంద్రబాబు వెన్నుపోటు


తాళ్లపూడి: తుని రైలు దహనం కేసును తిరగదోడుతూ గతంలో కొట్టేసిన కోర్టు తీర్పుపై హైకోర్టులో ప్రభుత్వం అప్పీలు చేస్తుందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వీటిని మండల కాపు నాయకులు తీవ్రంగా ఖండించారు. మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, రాష్ట్ర కాపు జేఏసీ నాయకుడు తోట రామకృష్ణ ఓ ప్రకటనలో మంగళవారం ప్రభుత్వ ప్రయత్నాలను ఖండించారు. కాపులకు చంద్రబాబు వెన్నుపోటు పొడుస్తున్నారని వారన్నారు. కాపులపై మీకు ఎందుకు అంత కక్ష. కాపు ఉద్యమం సందర్భంగా తుని రైలు దహనం సహా, కాపు సామాజిక వర్గం నాయకులపై ఉన్న కేసులన్నీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఎత్తివేస్తే మళ్లీ ఈ కేసును ఇప్పుడు చంద్రబాబు తిరగదోడే ఆలోచన చేయడం సరికాదన్నారు. కాపు సామాజికవర్గాన్ని వెన్నుపోటు పొడిచేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని వారన్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ


దుద్దుకూరులో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఆమెన్ ట్రస్ట్ ప్రతినిధులు

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కళ్లను కంటికి రెప్పలా కాపాడేందుకు విస్తృతంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు జీవీవీ ప్రసాద్ తెలిపారు. ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం దుద్దుకూరులో షాలోమ్ టెంపుల్ ఆవరణలో మంగళవారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పోషకాహారలోపం వల్ల కంటి సంబంధిత ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రోగులకు సూచించారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇవాంజిలిన్ మాట్లాడుతూ వేమగిరి పరమాంస యోగానంద కంటి ఆసుపత్రి సహకారంతో గత వారం దుద్దుకూరులో ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేసి 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. వీరిలో 20 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా, 120 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా దుద్దుకూరుతో పాటు పలు ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా దోమ తెరలను పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీఎస్ రామచంద్రరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాంద్రు రామకృష్ణ, కె.బుజ్జిబాబు, గ్రామస్తులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లపూడి: బల్లిపాడు మండల ప్రజాపరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముత్తమాల మేఘన శ్రీ, చదలవాడ షైనీ కుమారదేవంలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్ఎం జీవీకే రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, వరలక్ష్మి కృషి ఫలితంగా విద్యార్థినులు ప్రవేశ పరీక్షలో విద్యార్థినులు సాధించారని అభినందించారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని వినతి

తాళ్లపూడి: గోవుల అక్రమ రవాణాను నిలుపుదల చేయాలని తహసీల్దార్ మోహన భారతికి మంగళవారం విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గోవులను అక్రమంగా రవాణా చేయడం దారణమన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బొర్రా శ్రీరామ్ మూర్తి, ఎం.రాజేష్ తిరుమల నాథుని నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ

నిడదవోలు రూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి దుర్గేష్ మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో 540 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఎంపీపీలు తిరుమశ్ల భాగ్యలక్ష్మి, కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు పాల్గొన్నారు.

టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

ఉండ్రాజవరం: టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషాదేవి అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు ఇంటెన్సిఫైడ్ టీబీ ఎలిమినేషన్ డ్రైవ్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలు మించి దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తక్కువుగా ఉన్న వారిని గుర్తించి వారికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించాలని టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి సూచించారు.